# నేనే రాజు.. నేనే మంత్రి!

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. కేంద్ర మంత్రులు, పార్టీ అధిష్టానం పెద్దలను కలిసేందుకు ఢిల్లీ వచ్చిన ఆయన గురువారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

**కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడంలేదు?**

'కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 24 గంటల్లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తామని గతంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. అలాంటిది రెండేళ్లుగా కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడంలేదు? ఆయన కోరారు కాబట్టే కాళేశ్వరంపై విచారణ చేయమని సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్ర ప్రతిపాదనను సీబీఐ డైరెక్టర్, కేంద్ర హోం శాఖ కార్యదర్శికి అందజేశాం. ప్రధాని కార్యాలయం వరకు విషయం వెళ్లింది. అయినప్పటికీ అతీగతీ లేదు. ఇంతవరకు విచారణ జరపలేదు.. కేసీఆర్‌ను జైల్లోనూ వేయలేదు. దీనికి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి.

**కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు?**

నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్‌గాంధీ, సోనియా గాంధీలను విచారించారు. ఈఫార్ములా కేసును కూడా ఈడీకి ఇచ్చాం. కానీ మాజీమంత్రి కేటీఆర్‌ను ఈడీ ఎందుకు అరెస్టు చేయడం లేదు? ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావును విదేశాల నుంచి తీసుకొచ్చాం. కేంద్ర ప్రభుత్వం సహకరించలేదు కాబట్టి ఆయనను తీసుకొచ్చేందుకు 20 నెలలు పట్టింది. ఆయన చెప్పిన సమాచారం ఆధారంగా మిగతావాళ్లకు నోటీసులు ఇచ్చాం ఇందులో రాజకీయం ఏమీలేదు. నేను ఇందులో జోక్యం చేసుకుంటే ఎవరూ బయట ఉండరు.

**'నైనీ'పై అసెంబ్లీలో ఆధారాలు వెల్లడిస్తా..**

నైనీ కోల్ బ్లాక్‌లో సైట్ విజిట్ అనే నిబంధన కేంద్రమే పెట్టింది. ఒక్క సింగరేణిలోనే ఆ రూల్ ఉందని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. నేను చెప్పింది నిజమైతే కిషన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి. లేదంటే నేను చెబుతా. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అన్ని ఆధారాలను వెల్లడిస్తా. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే విద్యుత్ కొనుగోళ్లు సహా అన్ని కేసులూ సీబీఐకి అప్పగించేందుకు సిద్ధం. రాష్ట్ర పోలీసులపై కిషన్‌రెడ్డికి విశ్వాసం లేదంటే బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య కేసును కూడా సీబీఐకి అప్పగిస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**గోదావరికి ఒక రూలు, కృష్ణాకు ఒక రూలా?**

'పాలమూరు, నెట్టెంపాడు తదితర ప్రాజెక్టులు సమైక్య రాష్ట్రంలో ఉన్నవే. వీటిపై ఏపీవాళ్లు పిటిషన్లు వేస్తున్నారు. ప్రాజెక్టులు కట్టుకోకుండా మాకు అవాంతరాలు సృష్టిస్తున్నారు. గోదావరిలో వాళ్లకు కావాల్సింది వాళ్లు అడుగుతున్నారు. కృష్ణాలో మాకు కావాల్సింది కూడా ఇవ్వాలి కదా. మా ప్రాజెక్టులు అడ్డుకుంటే ఊరుకుంటామా? వాళ్లకు ఏది నచ్చితే అది తీసుకుంటామంటే ఎలా? గోదావరికి ఒక రూలు, కృష్ణాకు ఒక రూలు అంటే కుదరదు. వాళ్ల ప్రాజెక్టులకు ఏ రూలు వర్తిస్తుందో అదే రూలు మాకూ వర్తిసుంది. ఇక్కడ ప్రధాన సమస్య కృష్ణా జలాలే. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ఎన్‌ఓసీ ఇస్తే.. వాళ్లు ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా మాకు అభ్యంతరం లేదు..' అని రేవంత్ స్పష్టం చేశారు.

**బుల్లెట్ ట్రెయిన్ హబ్‌గా హైదరాబాద్**

'రాష్ట్రంలో కేంద్రం మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారబోతుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో, ఫ్యూచర్ సిటీకి దగ్గర్లో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఇందుకోసం భూమిని కూడా పూలింగ్ చేస్తున్నాం. ఎయిర్టపోర్టుని బుల్లెట్ రైళ్లకు అనుసంధానం చేసి ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చూస్తాం. 2034 లోపు బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి వస్తాయి. మెట్రో ఫేజ్2కు మార్చి 31 డెడ్‌లైన్‌గా పెట్టుకుని పని చేస్తున్నాం. జూన్ 2కు మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేయాలనుకుంటున్నాం..' అని సీఎం తెలిపారు.

**ఎఫ్‌ఎస్‌ఎల్‌పై విపక్షాల విష ప్రచారం**

'ఎఫ్‌ఎస్‌ఎల్‌లో కీలక కేసులకు సంబంధించిన రికార్డులు కాలిపోయాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కావాలని విష ప్రచారం చేస్తున్నాయి. అసలు విషయం వాళ్లకు తెలియదు. ఒక కేసుకు సబంధించిన వివరాలను పరిశీలించిన తర్వాత.. అవి తిరిగి దర్యాప్తు సంస్థకే అప్పగిస్తారు. 2021లో 'ఓటుకు నోటు' కేసు రిపోర్టు కూడా అలాగే తిరిగి ఇచ్చేశారు. ఇప్పుడు ఆ రికార్డులు కూడా అందులో ఉన్నాయంటే ఎలా?..' రేవంత్ అని ప్రశ్నించారు. 'ఎన్టీఆర్‌కు భాష, రాష్ట్రాల సరిహద్దులు లేవు. ఆయన ఏ ఒక్కరి సొత్తూ కాదు.. జాతీయ సొత్తు. పార్లమెంటులో ఎన్టీఆర్ విగ్రహం పెట్టిందే కాంగ్రెస్ పార్టీ. ఆయనకు భారతరత్న ఇవ్వాలి. అందుకు నేను మద్దతిస్తా. ఇది నా వ్యక్తగత అభిప్రాయం, డిమాండ్. త్వరలో హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తా..' అని రేవంత్ చెప్పారు.

# కేంద్రం కార్మిక హక్కుల చట్టాలను కాలరాస్తోంది

-మొదటిపేజీ తరువాయి

సార్వత్రిక సమ్మెలో భాగంగా భారీ ప్రదర్శనను ఆర్టీసీ కల్యాణ మండపం నుంచి ఇందిరాపార్కు వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్మిక, రైతు, ప్రజా సంఘాలు కదం తొక్కా యి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక రైతు వ్యతిరేక నల్ల చట్టాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్టీయూ, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్లు, అసోసియేషన్లు, రైతు సంఘాల నేతలు వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా కాలరాస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానని స్పష్టంచేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు, ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఎం.నర్సింహ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టీయూటీసీ రాష్ట్ర నాయకులు ఎస్ఎల్ పద్మ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కశ్య పద్మతో పాటు వివిధ సంఘాల నేతలు, ఆటో డ్రైవర్ యూనియన్లు, గిగ్ వర్కర్స్ యూనియన్, బ్యాంక్, అంగన్‌వాడీ, మున్సిపల్, జీహెచ్ఎంసీ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి.

# చిన్నారుల ఇంటికే పోషకాహారం!

హైదరాబాద్




మహానగరంలోని ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా రాష్ట్ర మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా వలస కార్మిక కుటుంబాల్లోని చిన్నారులకు పౌష్టికాహారాన్ని చేరువ చేసే లక్ష్యంతో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను తీసుకొస్తోంది. అత్యధిక సంఖ్యలో వలస కార్మికులుంటున్న హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పరిధిలో వీటిని నిర్వహించాలని నిర్ణయించింది. చిన్నారులు ఎక్కువగా ఉండే చోటుకు ఈ కేంద్రాలను తీసుకెళ్లి ఆహారాన్ని పంపిణీ చేసేందుకు కసరత్తు చేపట్టింది. భవనాల కొరత, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటికి తోడు కొత్త అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలతో సంఖ్య పెంచే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలవైపు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది.

**25 వేల మందికి మొబైల్ కేంద్రాల ద్వారా...**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో హెచ్‌ఎండీఏ విస్తరించి ఉంది. ఈ నాలుగు జిల్లాల్లో ప్రస్తుతం 2,364 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అయితే ఈ కేంద్రాల పరిధిలోని 25,310 మంది అర్హులైన చిన్నారులు, గర్భిణిలు, బాలింతలు ఆహారం అందుకోలేకపోతున్నట్లు శిశు సంక్షేమ శాఖ పరిశీలనలో తేలింది. అంగన్‌వాడీ కేంద్రాలు సమీపంలో లేకపోవడమే ఇందుకు కారణమని అధికారులు గుర్తించారు. దీంతో అర్హులందరికీ అంగన్‌వాడీ సేవలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ క్రమంలో టేక్ హోం రేషన్ (ఇంటికే రేషన్) విధానంలో అర్హుల నివాసాలకే పోషక పదార్థాలను అందించే విధంగా మొబైల్ కేంద్రాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కేంద్రాల ద్వారా బాలామృతం, పాలు, చిరుతిండ్లు (స్నాక్స్), కోడి గుడ్లు, బియ్యం తదితర పోషకాహార పదార్థా టలను నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. 274 మురికివాడలను కవర్ చేసేందుకు 37 వాహనాలను అద్దెకు తీసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 7 వాహనాలు, మేడ్చల్ మల్కాజిగిరిలో 15, సంగారెడ్డిలో 1, రంగారెడ్డిలో 14 వాహనాలను వినియోగించనున్నారు. ఈ మొబైల్ కేంద్రాలను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా నిర్వహిస్తారు. ఈ కేంద్రాల నిర్వహణకు ఏటా రూ.4 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు.

## 15 రోజుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం

హైదరాబాద్



రాష్ట్రంలో ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్‌ఎస్) మరో 15 రోజుల్లో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం అమలుకు ప్రతి నెలా ఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ పే/పెన్షన్ నుంచి 1.5 శాతం చందాగా చెల్లిస్తారు. దానికి సమానంగా ప్రభుత్వం కూడా 1.5 శాతం కేటాయిస్తుంది. రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన గురువారం జరిగిన ఎంప్లాయీ హెల్త్‌కేర్ ట్రస్టు సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సీవీ ఆనంద్, మహేశ్‌దత్ ఎక్కా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఉదయకుమార్‌లతోపాటు.. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమక్షంలో కొత్త పథకాన్ని ప్రారంభించాలని సమావేశం నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా పథకాన్ని ప్రారంభిస్తారు. ఉద్యోగులకు ఉత్తమ వైద్య సదుపాయాలను అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, ప్రస్తుతం ప్రతిపాదించిన కొత్త పథకం ఒక ముందడుగు అని సీఎస్ తెలిపారు. రానున్న కాలంలో ఈ పథకంలో మార్పులు, చేర్పులపై ట్రస్టు సమావేశంలో నిర్ణయిస్తారని తెలిపారు. కొత్త పథకం వివరాలను వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

**ఏడాదికి రూ.1,056 కోట్ల వ్యయం**

రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 7.14 లక్షల మంది ఉన్నారు. వారి కుటుంబ సభ్యులు 12.84 లక్షల మంది. ఈ పథకం కోసం ఉద్యోగులు మూలవేతనం నుంచి ప్రతి నెలా 1.5 శాతం చెల్లిస్తే సంవత్సరానికి రూ.528 కోట్లు జమవుతాయి. అంతే మొత్తాన్ని ప్రభుత్వం తన వాటాగా చెల్లిస్తుందని, దాంతో మొత్తం రూ.1,056 కోట్లవుతాయని క్రిస్టినా చోంగ్తూ వివరించారు. ప్రభుత్వం గత నాలుగేళ్లలో అత్యధికంగా 2023-24లో రూ.803 కోట్లు వైద్య చికిత్సల కోసం ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ చేసింది. ఆ ప్రకారం లెక్కించి 1.5 శాతం చందాగా నిర్ణయించారు. ఎంప్లాయీ హెల్త్‌కేర్ ట్రస్టులో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు ప్రతినిధులు, పెన్షనర్ల సంఘాల నుంచి ఇద్దరు సభ్యులు ఉంటారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఒకరిని ట్రస్టు సీఈవోగా నియమిస్తారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు.

# పుర తీర్పు నేడే

-మొదటిపేజీ తరువాయి

చేయగా, బ్యాలెట్ బాక్స్‌లను ఆయా ప్రాంతాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అక్కడ భద్రంగా ఉన్న బ్యాలెట్‌బాక్స్‌లను ఉదయం అభ్యర్థుల సమక్షంలో గట్టి బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. కౌంటింగ్ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారు. వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్నది ప్రజాతీర్పుతో వెల్లడికానుంది. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో మొత్తం 73.01 శాతం ఓట్లు పోలైన విషయం విదితమే.

**ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం**

మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడమనేది అన్ని ప్రధాన పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ల కావొస్తుండటంతో రాబోయే రెండున్నరేళ్లకు సంబంధించి పట్టణ ప్రజలు ఏవిధమైన తీర్పు ఇవ్వబోతున్నారనేది చర్చనీయాంశమైంది. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలే సాధించిన బీఆర్ఎస్ అదే ఒరవడిని కొనసాగించి గణనీయమైన సంఖ్యలో స్థానాలు గెలుచుకుంటుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. లోక్‌సభ ఎన్నికల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల దాకా మంచి ప్రదర్శన కనబరిచినందున, పట్టణప్రాంతాల్లో పట్టు ఉందని భావిస్తున్న బీజేపీ అందుకు అనుగుణంగా ఫలితాలను సాధించగలదా అన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటాయి? ఎవరికి ప్రతికూలంగా ఉంటాయన్న వాడీవేడీ చర్చ జరుగుతోంది. మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం ద్వారా తనపట్టు నిలుపుకోవాలని అధికార కాంగ్రెస్ యత్నిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం పూర్వవైభవం కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వీటిని నిచ్చెనగా వినియోగించుకోవాలన్న పట్టుదలతో బీజేపీ ఉంది. దీనికితోడు ఎంఐఎం తన పరిధిని విస్తరించుకునే దిశగా పావులు కదుపుతోంది. ఎన్నికల ఫలితాల తరువాత ఛైర్‌పర్సన్/ మేయర్ పదవులు దక్కించుకోవడానికి ఆయా పార్టీలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. సీట్లు తగ్గే మున్సిపాలిటీల్లో గెలిచిన వారికి ఎరవేసే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలనేలా పార్టీలు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రతీ వెయ్యి ఓట్లకు ఒక రౌండ్..**

116 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని వెల్లడించారు. ఉదయం 8 గంటలకు బ్యాలెట్ ఓట్లను వార్డుల వారీగా ఒకచోట వేసి వాటిని కలిపిన తరువాత 25 బ్యాలెట్ పత్రాలను ఒక బండిల్‌గా చేస్తామని, ఆవిధంగా 40 బండిల్స్‌ను ఒకచోట చేరుస్తామన్నారు. ప్రతీ వెయ్యి ఓట్లకు ఒక రౌండ్‌గా లెక్కించనున్నారు. మున్సిపాలిటీల్లో మూడు నాలుగు రౌండ్లలో వార్డు ఫలితం తేలుతుందని, అదే కార్పొరేషన్లలో అధికంగా ఓట్లు ఉన్నందున అక్కడ ఏడెనిమిది రౌండ్లకు వెళ్లే అవకాశం ఉందని ఎన్నికల కమిషన్ చెప్పింది. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థికి వచ్చిన వ్యాలిడ్ ఓట్లను వంద లెక్కన కట్టనున్నట్లు తెలిపింది. నోటా, ఇన్‌వ్యాలిడ్ ఓట్లను కూడా వంద లెక్కన బండిల్స్‌గా చేస్తామని పేర్కొంది. ప్రతీ బ్యాలెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే.. ఓటు వచ్చిన అభ్యర్థికి కేటాయించిన కంపార్ట్‌మెంట్‌లో వేస్తారని పేర్కొంది. కౌంటింగ్ పూర్తయిన తరువాత.. సంబంధిత అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల నుంచి సంతకాలు తీసుకున్న తరువాత ఫలితాన్ని ప్రకటిస్తామని చెప్పింది. అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తరువాత గెలిచిన అభ్యర్థికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారని ఎన్నికల కమిషన్ పేర్కొంది.

**మొబైల్ ఫోన్‌లకు అనుమతి నో..**

కౌంటింగ్ కేంద్రంలోకి కౌంటింగ్ సూపర్‌వైజర్, సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని ఎన్నికల కమిషనర్ చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించబోమన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (సీఆర్‌పీసీ 144) అమల్లో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెప్పింది. అందువల్ల ఫలితాల అనంతరం అభ్యర్థులు ఎవరూ కూడా ఊరేగింపులు, సంబరాలు చేసుకోవడం నిషేధమనీ స్పష్టం చేసింది. ఏడు కార్పొరేషన్లలో 414 డివిజన్లు. 116 మునిసిపాలిటీల్లో 2,582 వార్డులున్నాయి. కార్పొరేషన్లలో కరీంనగర్‌లో అత్యధికంగా 66 డివిజన్లు ఉండగా, అత్యల్పంగా నల్లగొండలో 48 ఉన్నాయి.

## 'గాంధీ సరోవర్'కు 100 ఎకరాలు ఇవ్వండి



-మొదటిపేజీ తరువాయి

ఈ ప్రాజెక్టు చాలా ముఖ్యం"అని ముఖ్యమంత్రి కోరగా.. అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు.

**18 లక్షల టన్నుల ధాన్యాన్ని తీసుకోవాలి**

2025-26 సీజన్‌లో వానాకాలం పంటకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సేకరించిన 18 లక్షల టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం వెంట ఉన్నారు. "వానాకాలం పంటకు సంబంధించి కేంద్రం 53.73 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ రాష్ట్రంలో భారీగా దిగుబడులు రావడంతో అదనంగా 18 లక్షల టన్నులు సేకరించాల్సి వచ్చింది. అందువల్ల దాన్ని 10% నూకతో సహా ఎఫ్‌సీఐ తీసుకోవాలి. 2024-25 యాసంగి పంటకు సంబంధించి 5% నూకతో ఇప్పటికే అనుమతిచ్చిన దానికి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతివ్వాలి. ఎఫ్‌సీఐకి 2014-15 వానాకాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి రావాల్సిన బకాయిలు రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలి" అని ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రులకు తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను సీఎం ఇచ్చారు. ఈ సమావేశాల్లో ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**హైస్పీడ్ కారిడార్ల ఎలైన్‌మెంట్లపై ముఖ్యమంత్రి సూచనలు**

హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ల ఎలైన్‌మెంట్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కన్సల్టెంట్ సంస్థకు పలు సూచనలు చేశారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతను రైల్వే శాఖ ఆర్ఐటీఈఎస్ కన్సల్టెన్సీ సంస్థకు అప్పజెప్పింది. ఆ సంస్థ ప్రతినిధులు దిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ఇందుకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

# మరో 114 రఫేల్ యుద్ధ విమానాలు

న్యూఢిల్లీ



అధునాతన యుద్ధ విమానాలతో దేశ సరిహద్దులను, గగనతలాలను శత్రు దుర్భేద్యంగా చేసే లక్ష్యంగా భారత రక్షణ మంత్రిత్వ శాఖ అదనంగా 114 రఫేల్ ఫైటర్‌జెట్‌లను కొనుగోలుచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.3.6 లక్షల కోట్లతో రూపొందించిన కొనుగోలు ప్రతిపాదనలను గురువారం రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని రక్షణ శాఖ మంత్రి పరిధిలోని 'రక్షణ కొనుగోళ్ల మండలి(డీఏసీ)'ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 18 యుద్ధ విమానాలను ఫ్రాన్స్‌లోనే తయారుచేసి భారత్‌కు సరఫరాచేయనున్నారు. మిగతా 96 విమానాలను భారత్‌లో తయారుచేయనున్నారు. వీటిల్లో సగానికిపైగా విమానాలను దశలవారీగా దేశీయంగా తయారుచేసిన విడిభాగాలతో రూపొందించనున్నారు. ఇందుకోసం దేశీయంగా అనుబంధ కర్మాగారాలను నెలకొల్పడంతో దేశీయ రక్షణరంగ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందనుంది. రఫేల్ విమానాలతో పాటు అత్యంత ఎత్తులో తిరిగే సూడో శాటిలైట్(ఏఎస్‌హెచ్‌ఏపీఎస్)లనూ కొనుగోలుచేయనున్నారు.
సూడో శాటిలైట్లు సౌరఫలకాలతో పనిచేస్తూ నిఘా, పర్యవేక్షణ, కమ్యూనికేషన్ సేవలను అందిస్తాయి. మరో నాలుగురోజుల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత పర్యటన మొదలుకానున్న వేళ ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ ఏవియేషన్‌తో ఒప్పందం కుదరబోతుండటం విశేషం. దసాల్ట్ సంస్థలో దాదాపు 10 నెలలపాటు విస్తృతస్థాయిలో చర్చలు జరిపాక ఈ ఏడాది చివరిలోపు సమగ్రస్థాయిలో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. విమానాలతోపాటు వాటిలోని విడిభాగాల తయారీకి సంబంధించిన సాంకేతికత బదిలీ వంటి అంశాలపై కూలంకషంగా చర్చిం చాల్సి ఉంది.
ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఎస్) ఆమోదం పొందాల్సి ఉంది. "అదనపు విమానాలతో భారతవాయుసేన.. సరిహద్దుల వంటి ఉద్రిక్త ప్రాంతాల్లో దాడి సామర్థ్యాలు ద్విగుణీకృతమవుతాయి. వీటితోపాటు కొనే శక్తివంత క్షిపణులు సుదూరాల్లోని శత్రు స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడిచేసే సత్తాను పెంచుతాయి. ఒక సూడో ఉపగ్రహాలు అనేవి 30 కిలోమీటర్ల ఎత్తులో స్ట్రాటో ఆవరణలో చక్కర్లు కొడుతూ శత్రు స్థావరాలపై నిఘా, పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ ఇంటెలిజెన్స్, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ సేవలను అందిస్తాయి"అని రక్షణ శాఖ తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది.

**ఆనాడు రూ.1.63 లక్షల కోట్లతో మొదలై..**

2015లో మోదీ ప్రభుత్వం భారత వాయుసేనలోని స్క్వాడ్రాన్ల సంఖ్య తగ్గిపోతోందని, వీటిని అత్యాధునిక యుద్ధవిమానాలతో భర్తీచేయాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు భారత్‌కు 36 రఫేల్ విమానాలను సరఫరాచేసింది. ఇవి ప్రస్తుతం భారత వాయుసేన స్క్వాడ్రాన్‌లో సేవలందిస్తున్నాయి.
గతంలోనూ 114 బహుళ ప్రయోజనకర యుద్ధ విమానాలు(ఎంఆర్‌ఎఫ్‌ఏ)లు తమకు అవసరమని భావించి వాయుసేన రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్(టెండర్)ను జారీచేసింది.
అప్పట్లో అది ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధాల కొనుగోలు ఒప్పంద ప్రతిపాదనల్లో ఒకటిగా రికార్డ్‌కెక్కింది. ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకునేందుకు దసాల్ట్ ఏవియేషన్‌తోపాటు అమెరికాకు చెందిన లాక్‌హీల్డ్ మార్టిన్, బోయింగ్, యూరోఫైటర్ కంపెనీలు పోటీపడ్డాయి. భారత్‌కు రఫేల్ విమానాలు విక్రయించేందుకు దసాల్ట్, ఎఫ్21లను అమ్మేందుకు లాక్‌హీల్డ్‌మార్టిన్, టైఫచీన్ జెట్‌లను విక్రయించేందుకు యూరోఫైటర్ సంస్థలు ఆసక్తి చూపించాయి. గరిష్టంగా 42 స్క్వాడ్రాన్‌లకు అనుమతి ఉండగా 31 స్క్వాడ్రాన్లను కొనుగోలుచేయాలని రక్షణశాఖ భావించింది.

**సైన్యం, నేవీ కోసమూ కొనుగోళ్లు..**

భారత సైన్యం కోసం దేశీయంగా తయారైన వైభవ్ ట్యాంక్ విధ్వంసక మందుపాతరలు, యుద్ధట్యాంక్‌లను తరలించే ఆర్మార్డ్ రికవరీ వెహికల్(ఏఆర్‌వీ), ఉభయచర ఫైటింగ్ వెహికల్(బీఎంపీ2), టీ72 ట్యాంక్‌లనూ కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలకూ 'రక్షణ కొనుగోళ్ల మండలి(డీఏసీ)'ఆమోదముద్ర వేసింది. భారతనావికాదళం కోసం పీ8ఐ రకం నిఘా, పర్యవేక్షణ విమానంతోపాటు దేశీయంగా తయారుచేసే నాలుగు ఎండబ్ల్యూ మెరైన్ గ్యాస్ టర్బైన్‌తో పనిచేసే ఎలక్ట్రిక్ పవర్ జనరేటర్ల కొనుగోలు ప్రతిపాదనలకూ ఆమోదం తెలిపారు.

# పాక్షికంగా ప్రభావం చూపిన సమ్మె

న్యూఢిల్లీ



కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు గురువారం సమ్మె చేపట్టాయి. కార్మికులు, రైతులు, పలు రంగాల శ్రామికు లు కలిపి దేశవ్యాప్తంగా మొత్తంగా 30 కోట్ల మంది సమ్మెలో పాల్గొన్నారని కార్మిక సంఘాలు ప్రకటించాయి. అయితే సమ్మె ప్రభా వం దేశవ్యాప్తంగా పాక్షికంగానే కన్పించింది. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ప్రజా రవాణా, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ కార్యకలాపాలు యతాథతంగా కొనసాగాయి. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే వేలాది మంది కార్మికుల భారీ నిరసన ప్రదర్శనలతో జనజీవనం కాస్తంత స్తంభించింది. ఒడిశా, కేరళ, తమిళనాడు, గోవా, జార్ఖండ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో సమ్మె ప్రభావం అత్యధికంగా కన్పించింది. చాలా రాష్ట్రాల్లో కార్మిక సంఘాలు ఆయా పని ప్రాంతాలు, ఫ్యాక్టరీలు, కర్మాగారాల ప్రధాన ద్వారాల వద్ద ధర్నాకు దిగి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించాయి. అత్యంత వివాదాస్పద నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కార్మికసంఘాలు డిమాండ్‌చేశాయి. ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు, సస్టేనబుల్ హార్నెసింగ్, అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) చట్టాలను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్‌చేశాయి. వీబీ జీ రాంజీ చట్టాన్ని పక్కనబెట్టి వెంటనే పాత ఎంజీనరేగా చట్టాన్ని యథాతథంగా పునరుద్ధరించాలని కోరాయి. సమ్మె కు సంఘీభావంగా పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు తమ కార్యాలయాలు, కర్మాగారాలకు ఆలస్యంగా హాజరయ్యారు.
దేశవ్యాప్తంగా 600కుపైగా జిల్లాల్లో సమ్మె విజయవంతమైందని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లతోపాటు సంయుక్త కిసాన్ మోర్చాలు, వ్యవసాయ కార్మికుల సంఘాల సంయుక్త వేదిక గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.
ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఎస్ ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంఘాలు ఈ సంయుక్త ఫో రమ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి.
ఢిల్లీ లో అన్ని పారిశ్రామిక వాడల నుంచి పలు కార్మిక సంఘాల కార్యకర్తలు నిరసన ప్రదర్శనలను చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద సమావేశం నిర్వహించి కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక ముఖ్యనేతలు తూర్పారబట్టారు. తమ రాష్ట్రంలో బ్యాంకింగ్, బీ మా, బొగ్గు రంగంలో కార్యకలాపాలు పూర్తి గా స్తంభించిపోయాయని జార్ఖండ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఐ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఉమేశ్ దాస్ ప్రకటించారు.
కేరళలో కేఎస్‌ఆర్‌టీసీ బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి. ప్రైవేట్ బస్సులూ రోడ్డెక్కకపోవడంతో జనం తీవ్ర అవస్థలు పడ్డారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో మాత్రం జనజీవనానికి ఎలాంటా ఆటంకం కలగలేదు.

# ఐఐఎం లక్నోలో 3 కొత్త ఏఐ కోర్సులు

న్యూఢిల్లీ

ఎప్పటికప్పుడు కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు చేరువచేయాలనే లక్ష్యంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(లక్నో) గురువారం మూడు ఏఐ కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్) ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బిజినెస్ అనలిటిక్స్, టెక్ ఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ సైన్స్ + టెక్ ఎంబీఏ కోర్సులను అందుబాటులోకి తెచ్చారని ఆయన వెల్లడించారు. గురువారం ఢిల్లీలో జరిగిన భారత్ బోధన్ ఏఐ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు.
"నైతిక ఏఐలో భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా అవతరింపజేయాలనేదే ప్రభుత్వ లక్ష్యం. మేనేజ్‌మెంట్ విద్యతోపాటు ఆవిష్కరణలు, రియల్ వరల్డ్ సోషియాటిక్ అప్లికేషన్లలో ఏఐ కోర్సులను విస్తృతంగా అందించాలని బిజినెస్ స్కూళ్లకు సూచిస్తున్నాం. ఏఐ ఆధారిత భవిష్యత్తుకు తగ్గట్లుగా విద్యార్థులను తయారుచేయడంతోపాటు మానవీయ విలువలను పెంపొందిస్తూ జాతీయాభివృద్ధికి సాంకేతికత దోహదపడేలా చేయండి"అని బిజినెస్ స్కూళ్లకు మంత్రి పిలుపునిచ్చారు.
"ప్రపంచంలోనే అత్యధిక యువ కార్మికశక్తితో అలరారే భారత్‌లో దేశీయంగా ఏఐ మోడళ్లను తయారుచేసుకునే అద్భుత అవకాశం దాగి ఉంది. ఇది




ప్రపంచ సమస్యలనూ తీర్చగలదు అని చెప్పారు.

## రాహుల్ సభ్యత్వ రద్దుకు నోటీసు

ఢిల్లీ

లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలని భాజపా ఎంపీ నిశికాంత్ దుబె డిమాండ్ చేశారు. ఎంపీగా ఆయన్ని తొలగించడంతోపాటు జీవితంలో ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా వేటువేయాలని కోరుతూ నోటీసు సమర్పించారు. ప్రాధాన్యమున్న అంశాలపై సభ చర్య తీసుకునేందుకు ప్రతిపాదించే 'సబ్‌స్టాంటివ్ మోషన్'ను తాను కోరుతున్నట్లు దుబె తెలిపారు. రాహుల్ తరచూ థాయ్‌లాండ్, వియత్నాం, కంబోడియా వంటి దేశాలకు వెళ్తూ సారోస్ ఫౌండేషన్, యూఎస్‌ఎయిడ్, ఫోర్డ్ ఫౌండేషన్ వంటి సంస్థలతో చేతులు కలిపి.. భారత్ వ్యతిరేక శక్తులతో కుమ్మక్కు అవుతున్నారని ఆరోపించారు. అందువల్ల ఎంపీగా ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని శూన్యగంటలో డిమాండ్ చేశారు. అంతకుముందు పీటీఐ వార్తాసంస్థకు దీనిపై ఇంటర్వ్యూ ఇచ్చారు. "రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ప్రచురితం కాని ఆత్మకథ పుస్తకం ఆయన చేతికి ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయనకున్న సంబంధాల గురించి నేను నోటీసులో ప్రస్తావించాను" అని దుబె స్పష్టంచేశారు. దుబె వ్యాఖ్యలపై విపక్ష నిరసనల నడుమ సభ శుక్రవారానికి వాయిదా పడింది. 'పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు- 2026'ను పార్లమెంటు ఉభయసభలు గురువారం ఆమోదించాయి. బడ్జెట్ సమావేశాల తొలివిడతలో ఆమోదం పొందిన మొదటి బిల్లు ఇది.

**పోరాటం ఆపను..**

రాహుల్ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ తనపై తీర్మానం పెట్టినా, కేసు పెట్టినా, ఇంకేం చేసినా కూడా రైతుల పక్షానే బలంగా పోరాడతానని స్పష్టంచేశారు.రాహుల్‌ను ఎవరూ బెదిరించలేరని ఆయన సోదరి, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా చెప్పారు. రాహుల్‌గాంధీ పెద్ద "అబద్ధాలకోరు" అని కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. దేశంలో అంతర్యుద్ధాన్ని ఆయన కోరుకుంటున్నారని చెప్పారు. 'రాహుల్ ఓ నకిలీ రైతు. బార్లీ-గోధుమ, పెయ్య-పడ్డ మధ్య తేడాలు కూడా ఆయనకు తెలియవు' అని విమర్శించారు.

## నేడు సేవా తీర్థ్ ప్రారంభం





న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) చిరునామా మారబోతోంది. ప్రధాని నరేంద్ర మోదీ సౌత్ బ్లాక్‌ను విడిచిపెట్టి, ఇకపై కొత్త భవనం సేవా తీర్థ్ నుంచే అధికారిక విధులు నిర్వర్తించబోతున్నారు. నూతన పీఎంఓగా తీర్చిదిద్దిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌ను మోదీ శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. అలాగే కర్తవ్య భవన్1, కర్తవ్య భవన్2ను సైతం ప్రారంభించనున్నారు. పీఎంఓతోపాటు జాతీయ భద్రతా మండలి సచివాలయం, కేబినెట్ సెక్రెటేరియట్ కూడా సేవా తీర్థ్‌లోనే కొలువుదీరనున్నాయి. ప్రస్తుతం ఇవి ఢిల్లీలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. కర్తవ్య భవన్1, 2లలో కేంద్ర న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయ శాఖలతోపాటు ఇతర శాఖలను ఏర్పా టు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా శాఖల కార్యాలయాలు లుటెన్స్ ఢిల్లీ రైసినా హిల్స్‌లోని నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లో ఉన్నాయి. వాటిని ఖాళీ చేయబోతున్నారు. ప్రధాని మోదీ చివరిసారిగా సౌత్ బ్లాక్‌లో శుక్రవారం సాయంత్రం కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని ఇప్పటికే కామన్ సెంట్రల్ సెక్రెటేరియెట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు తరలించారు.

## వైకల్య పింఛను రాజ్యాంగ హక్కు

**ప్రభుత్వమిచ్చే పరిహారం కాదు: సుప్రీం**




న్యూఢిల్లీ

ఓ జవానుకు అందజేయాల్సిన వైకల్య పింఛనును ప్రభుత్వం నిలిపివేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. వైకల్య (డిజెబిలిటీ పెన్షన్) పింఛను ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది కాదని స్పష్టం చేసింది. అది రాజ్యాంగబద్ధమైన హక్కని ప్రకటించింది. పింఛను అందజేయడంలో వివక్ష చూపడం లేదా తగ్గించడం వంటి చర్యలు సరికాదని తలంటింది. ఓ మాజీ సైనికోద్యోగికి వైకల్య పింఛను అందించాల్సిందేనంటూ సాయుధ బలగాల ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే‌ల ధర్మాసనం గురువారం కొట్టివేసింది. వైకల్య పింఛను ప్రభుత్వమిచ్చే దానం కాదు, అది దేశ సేవలో చేసిన త్యాగానికి దక్కిన గుర్తింపని తెలిపింది. 'పింఛను ప్రభుత్వం ఇచ్చే పారితోషికం కూడా కాదు. గత సేవలకు ప్రతిఫలంగా చెల్లించే వాయిదా వేసిన వేతనం. నిర్ణీత నిబంధనలు పూర్తి చేసిన తర్వాత, అది ఒక స్థిరమైన, చట్టపరంగా అమలు చేయదగిన హక్కుగా మారుతుంది. పింఛను ప్రయోజనాలు ఆస్తి హక్కు వంటివి. చట్టపరమైన అధికారం లేకుండా వీటిని ఆపేయడం, తగ్గించడం, రద్దు చేయడం సాధ్యం కాదు'అని ధర్మాసనం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఆదర్శవంతమైన యజమానిగా ఉండాలని, దేశం కోసం పనిచేసిన వారికి ప్రయోజనాలు అందించే విషయంలో నిష్పక్షపాతంతో, సమానత్వంతో వ్యవహరించాలని ఉద్బోధించింది. ఒక ప్రయోజనాన్ని విధానం ద్వారా గుర్తించి, న్యాయస్థానం ధ్రువీకరించినప్పుడు, అమలు విషయంలో వివక్ష చూపరాదని పేర్కొంది. న్యాయపరమైన తీర్పులు, ప్రభుత్వ నిర్ణయాల ద్వారా మాజీ సైనికులకు చెందాల్సిన పింఛనును నిరాకరించడమంటే ఆస్తిని లాక్కోవడమే అవుతుందని తెలిపింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏని ఉల్లంఘించడమేనని ధర్మాసనం స్పష్టం చేసింది. వైకల్య పింఛను హక్కు చాలా విలువైంది, ఒకసారి అది అర్హమైనదిగా తేలితే, బకాయిలు సహా చెల్లించాల్సిందేనని ఆదేశించింది.

